





పంట పండక.. ఊరికి వెళ్లలేక

పల్లె మెచ్చిన పండగ సంక్రాంతి కోసం పట్నంలో నివసిస్తున్న వారంతా పిల్లా, పాపలతో తమ సొంత గూడు, లేదా దూర ప్రాంతాలకు వెళ్లడం ఏటా జరిగేదే. కానీ ఈ ఏడాది పంట నష్టం రైతులకు నిరాశే మిగిల్చింది. అకాల వర్షాలు, అరకొర వర్షాలకు రైతులు డీలా పడ్డారు. కూటమి ప్రభుత్వం నిర్ణయాలు వారిని నిరాశకు గురి చేశాయి. దీంతో సొంత ఊళ్లకు వెళ్లే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. ఆదివారం కడప నగరంలోని కొత్త బస్టాండు నిర్మానుష్యంగా కనిపించడం ఇందుకు అద్దంపడుతోంది. పాత బస్టాండులో సాక్షి కెమెరాకు చిక్కిన దృశ్యాలివీ.. – రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా


యోగా గురువుకు సత్కారం



యోగా గురువును సత్కరిస్తున్న శిష్య బృందం

కడప కల్చరల్: కడప నగరానికి చెందిన ప్రముఖ యోగా మాస్టర్ పాలెంపల్లె అయ్యవారురెడ్డిని ఆదివారం ఆయన శిష్యులు ఘనంగా సత్కరించారు. సంక్రాంతి పండగ ముందస్తు వేడుకల్లో భాగంగా స్థానిక యాదాళ్ల రంగమ్మ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను 27 సంవత్సరాలుగా ఎలాంటి రుసుము ఆశించకుండా ప్రజలకు యోగా నేర్పుతున్నానని తెలిపారు. మానసిక, శారీరక వ్యాధులను యోగా అరికట్ట గలదని తెలిపారు.

వైభవంగా నీరాట ఉత్సవం



గోదామాత

కడప కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని కడప లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి ఆండాల్ నీరాట ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక తిరుచ్చిపై అమ్మవారితోపాటు, ఇతర ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. పుష్పాలతో అలంకరించి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయం నుంచి పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. అక్కడి మండపంలోని పీఠంపై అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశ్వక్సేన, తదితర పూజలు జరిపారు. వేదమంత్రోచ్చారణ మధ్య ప్రాకారోత్సవం నిర్వహించారు. అమ్మ వారిని దర్శించుకున్న భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆర్థిక శాస్త్ర విద్యార్థికి డాక్టరేట్



మౌలాలి

కడప ఎడ్యుకేషన్: వైవీయూ క్యాంపస్ పీజీ కళాశాల అర్థిక శాస్త్ర పరిశోధక విద్యార్థి మౌలాలికి యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. వైవీయూ అర్థికశాస్త్ర శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.గణేష్ నాయక్ పర్యవేక్షణలో ×ఎ స్టడీ ఆఫ్ లేబర్ వెల్ఫేర్ ప్రాక్టీసెస్ ఇన్ సెలెక్టెడ్ ఇండస్ట్రీస్ ఆఫ్ కర్నూల్ డిస్ట్రిక్ట్ అంశంపై ఆయన పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. దీంతో వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కెఎస్‌వి.కృష్ణారావు ఆయనకు డాక్టరేట్ అందజేశారు. పరిశోధకుడు రాసిన రెండు పరిశోధన పత్రాలు జాతీయ జర్నల్స్‌లో ప్రచురితం కాగా, పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. డాక్టరేట్ అందుకున్న మౌలాలిని ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, కుల సచివులు ఆచార్య పి.పద్మ, డి.దస్తగిరమ్మ, డి.సుల్తాన్, భార్య తస్లీమ్, విద్యార్థులు అభినందించారు.

ఐక్యంగా.. పండగ చేసుకోవాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్, ఆర్‌సీపీ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దేశంలో అందరూ ఐక్యంగా పండగలు జరుపుకోవాలని మాజీ పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్ పేర్కొన్నారు. ఐఎంఏ హాల్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ సమయంలో ఏ వర్గం దాడి చేస్తుందో అర్థంకాని పరిస్థితి ఉందన్నారు. లౌకిక ప్రజాస్వామ్య దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రజలను చైతన్యపరచి వారి హక్కులను కాపాడేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, వై. జయరాజు, రఘునాథరెడ్డి తదితరులు మాట్లాడారు. అంతకు ముందు ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కమిటీ ముద్రించిన ఉర్దూ క్యాలెండర్‌ను శైలజానాథ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హిదయతుల్లా, ఇలియాజ్‌మున్నా, చాంద్ బాషా, కరీముల్లా, ప్రసాద్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న శ్యాసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు వెంటనే బకాయిలు చెల్లించాలని ఎపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కడప ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించి వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు పూర్తయినప్పటికీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేయలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.2 వేల కోట్లు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం తమను నిరాశకు గురిచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు నరసింహులు, రాజారావు, మణికుమార్, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని మార్గం అనుసరణీయం



స్వామి వివేకానందుడికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ డా. జి. రవీంద్రనాథ్



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి

కడప స్పోర్ట్స్: స్వామి వివేకానందుడి మార్గం నేటి యువతకు అనుసరణీయమని నెహ్రూ యువ కేంద్రం జిల్లా సమన్వయకర్త మణికంఠ పేర్కొన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కడప వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో మెప్మా పీడీ సురేష్ రెడ్డితో కలిసి వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు క్రీడల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. మెప్మా పీడీ మాట్లాడుతూ దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అన్నారు. అనంతరం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా క్లబ్‌లకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. వాలీబాల్ పోటలు నిర్వహించి విజేత డీఎస్‌ఏ జట్టుకు రూ.7 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన సిద్ధవటం జట్టుకు రూ.3 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. ఉమామహేశ్వర రావు, దాసు, అశోక్, కరీముల్లా పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు.. యువతదే..

కడప కల్చరల్: దేశ భవిష్యత్తు అక్కడి యువశక్తిపై ఆధారపడి ఉంటుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. కడప రామకృష్ణ మిషన్ ఆవరణలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. వీసీ ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానందుడు యువతకు తన ప్రబోధాలతో స్ఫూర్తినిచ్చారని, ఆయన సూచనలు, సందేహాలు అందరికీ మార్గదర్శనం చేయగలవని అభిప్రాయపడ్డారు. తొలుత ఆశ్రమం, రిమ్స్ ఆవరణలో స్వామి వివేకానందుని శిల్పానికి ఆశ్రమ పాఠశాల బాలలు పూలమాల అలంకరించి నివాళులర్పించారు. మిషన్ కార్యదర్శి స్వామి అనుమపమానందజీ మహరాజ్ మాట్లాడుతూ వివేకానందుని బోధనలు ఏ తరానికైనా మంచి మార్గాన్ని చూపగలవన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో విజేతలైన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ స్వామి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితం అందరూ ఆదర్శంగా తీసుకొవాలన్నారు. శివరామకృష్ణ, రమేశ్‌యాదవ్, నాగరాజు, డా.సుబ్బయ్య, సుందరేశ్వర్, హజరతయ్య పాల్గొన్నారు.

కడప అగ్రికల్చర్: భారతీయ తత్వవేత్త వివేకానంద అని డీసీసీ బ్యాంకు డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప పేర్కొన్నారు. కడప డీసీసీ బ్యాంకులో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురప్ప, సిబ్బంది వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద భోదనలు అత్యంత ఆదర్శనీయం అన్నారు. చంద్రశేఖర్, అశోక్, బాలన్, అంజనేయ రెడ్డి, ప్రేమకుమార్‌లు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : వివేకానంద బోధనలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీ.లక్ష్మినారాయణరెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ రాయలసీమ ఇన్‌ఛార్జి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.కడప వినాయకనగర్ సర్కిల్‌లో వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. బీరం శ్రీధర్‌రెడ్డి, గజ్జల రామకృష్ణారెడ్డి, నాగిరెడ్డి, రమణ, అంబిక, చంద్రమోహన్, ప్రకాశ్‌రావు, ఫిరోజ్‌రావు, ఓబయ్య, మనోహర్‌రెడ్డి, అంకాలయ్య పాల్గొన్నారు.



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న అధికారులు

ఉపాధ్యాయ ఉద్యమ దిక్సూచి వెంకటరత్నం



మైనేని వెంకటరత్నానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యమ దిక్సూచి మైనేని వెంకటరత్నం అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా కడప యూటీఎఫ్ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనేని ఐక్య ఉపాధ్యాయ ఉద్యమ తీరుతెన్నులను ఉపాధ్యాయులకు చేరవేయడంలో ఐక్య ఉపాధ్యాయ పత్రికను వేదికగా చేశారన్నారు. మైనేని స్ఫూర్తిని అందిపుచ్చుకొని నేడు ఐక్య ఉపాధ్యాయ పత్రిక రాష్ట్రంలో పాఠకుల మన్ననలు పొందుతోందని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటామని ఎన్నికలకు ముందు ప్రకటించి, అనంతరం హామీలు మరచిందన్నారు. ఉద్యోగులు కూడబెట్టుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐ సొమ్ము ప్రభుత్వ అవసరాలకు వాడుకుంటోందని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సీవీ.రమణ, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరీ, చంద్రశేఖర్, కేదార్‌నాథ్, సూర్యకుమార్, శివశంకర్‌రెడ్డి, దేవదత్తం, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్/ఒంటిమిట్ట: ఒంటిమిట్ట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకగా సాగింది. 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులంతా ఆత్మీయ ఆలింగనం చేసుకుని నాటి తీపి గుర్తులు నెమరువేసుకున్నారు. చిన్నారి దాది నాగనిష్ట మహాగణపతిం.. మనసాస్మరామి అంటూ చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం అమరులైన తెలుగు ఉపాధ్యాయులు కృష్ణయ్య, గుర్రప్పనాయుడు చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో పూర్వ ప్రధానోపాధ్యాయులు బోడా రామయ్య మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతిని కోరుకునే ఉపాధ్యాయుడి పట్ల విద్యార్థులకు ఎనలేని గౌరవం ఉంటుందన్నారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడి విద్యార్థులను ఆశీర్వదించారు. విద్యాబుద్ధులు చెప్పి తమ ఉన్నతికి సహకరించిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. నాడు బోధించిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. పూర్వ విద్యార్థులు మౌనిక, సుజిత, బ్రహ్మయ్యలు వ్యాఖ్యానం చేయగా, సురేష్, రమేష్, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సేవా సమితిలో.. ముందస్తు సంక్రాంతి

కడప కల్చరల్: కడప రాజీవ్ మార్గ్‌లోని రెడ్డి సేవా సమితిలో ఆదివారం ముందస్తు సంక్రాంతి వేడుక నిర్వహించారు. కార్యాలయం వద్ద గల శివ శివానీ పాఠశాల మైదానంలో భోగి మంటలు వేశారు. వేద పండితులు శాస్త్రోక్తంగా అందరినీ ఆశీర్వదించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి, గుడ్లఆదినారాయణరెడ్డి కలిసి భోగి మంటను వెలిగించారు. సమితి సభ్యులందరూ కుటుంబ సమేతంగా హాజరై ఉత్సాహంగా గొబ్బి పాటలు పాడుతూ నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డికుమారి, మధుసూదన్‌రెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, వెంకటరెడ్డి, రమేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెడ్డి, డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భోగి మంటలు వేసి గొబ్బి పాటలు పాడుతున్న రెడ్డి సేవా సమితి ప్రతినిధులు

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ పార్కు ఎదుట నిర్వహించిన ఈ సంబరాల్లో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. హరిదాసు వేషధారణలో ఓ వ్యక్తి ఆకట్టుకున్నాడు. చిన్నారులు సినిమా పాటలకు ఉత్సాహంగా చిందులు వేశారు.

శిల్పారామంలో.. కడప కల్చరల్: కడప నగర శివారులోని శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగుతున్నాయి. మిస్బా మూవీ సహకారంతో సాంస్కృతిక కళా వేదికపై కడప నగరానికి చెందిన కిషోర్ బృందం తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. శాస్త్రీయ, జానపద, సినీ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో చిన్నారుల నృత్యం

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ సామాన్య ప్రజలపై అధిక పన్నుల భారం మోపుతోందని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కో–ఆర్డినేటర్ బండి జకరయ్య పేర్కొన్నారు. భారత ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ స్థానిక పాత బస్టాండు, వైవీ.స్ట్రీట్, గోకుల్ లాడ్జి, అప్సర సర్కిల్ ప్రాంతాలలో శనివారం ఆయన కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం విమానాశ్రయాలు, సముద్ర పోర్టులు, నూనెలు, సిమెంట్, బొగ్గు, రైల్వే లైన్లు, రక్షణ రంగాలను ప్రైవేటీకరించి కార్పొరేట్ సంస్థలకు తక్కువ ధరకు విక్రయించారన్నారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కేబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై జరుగుతున్న అన్యాయ చర్యలను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. పఠాన్ మహమ్మద్ అలీఖాన్, అబ్దుల్ సత్తార్, కుళ్లాయప్ప, కదిరి ప్రసాద్ గౌడ్, సిరాజుద్దీన్, మైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పట్టవా?

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడచినా ఉద్యోగుల సమస్యలు పట్టడం లేదని ప్రగతిశీల రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్ రెడ్డి పేర్కొన్నారు. కడపలోని సంఘం కార్యాలయంలో పీవీ.సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పయ్యావుల కేశవ్ చేసిన ప్రకటన ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలపై నీళ్లు చల్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేసిన 12వ పీఆర్‌సీ కమిషనర్ స్థానంలో కొత్త కమిషనర్‌ను నియమించాలన్నారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు ఐఆర్ ఇస్తామని చెప్పి.. ఇప్పటికీ ఇవ్వకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ మూడో తరగతి నుంచి సబ్జెక్టు వైస్ బోధన ఉండాలని, హైస్కూల్ ప్లస్ పాఠశాలలను ఏకపక్షంగా మూసివేయడం తగదన్నారు.నారాయణరెడ్డి , రామలక్ష్మిరెడ్డి, ప్రదీప్ రామ్మోహన్, లక్ష్మయ్య, పురుషోత్తంరెడ్డి, భాస్కర్ గుప్తా, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లెక్కల జమాల్‌రెడ్డి

చిత్తూరు, నెల్లూరు జట్ల విజయం



తలపడుతున్న అనంతపురం, చిత్తూరు జట్లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–12 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం చిత్తూరు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వైఎస్‌ఆర్‌ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు 35 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసింది. జట్టులోని హేమచంద్ర నాయక్ 47 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు మోహిత్ సాయి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 23.3 ఓవర్లలో 130 పరుగులు చేసింది. దీంతో 5 వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు విజయం సాధించింది.

నెల్లూరు జట్టు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. జట్టులోని ఆర్.యోగాంజనేయులు 52 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 34.1 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 210 పరుగులు చేసింది. జట్టులోని మానిష్ 96, సోహన్‌లిఖిత్ 58 పరుగులు చేశాడు. దీంతో నెల్లూరు జట్టు 9 వికెట్ల ఆధిక్యంతో విజయం సాధించింది.

ముగ్గులు వేయడం భారతీయ వారసత్వ కళ



ముగ్గులు వేస్తున్న మహిళలు

కడప కల్చరల్: ముగ్గులు వేయడం భారతీయ వారసత్వ కళ అని ఆర్మ్‌డ్ రిజర్వుడ్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య పేర్కొన్నారు. కడప పోలీస్ పరేడ్ మైదానంలో మహిళలకు ఆదివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు పోటీకి హాజరై సంక్రాంతి హరిదాసు, ధాన్యం బస్తాలు, ఎద్దుల బండ్లు, భోగి మంట, సూరీడు, రైతన్న తదితర చిత్రాలను వేసి ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ఇంటాక్ సంస్థ ప్రాచీన వారసత్వ సంప్రదాయ కళలను రక్షించుకునేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ వారసత్వ సంపదలైన పండగ విశిష్టతను నేటితరానికి చాటేందుకే సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేశామన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు అనంతబొట్ల వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలకు తమ సంస్థ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ పోటీల్లో గౌరి, శాలిని న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలు చిన్నారులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు జరిపి సంపత్ బృందం సహకారంతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భోగాల కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ, గౌరీశంకర్, పద్మప్రియ చంద్రారెడ్డి, పి.సంజీవరెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, తాహీన్, నాగవేణి, పార్వతమ్మ, భారవి, పి.వెంకటసుబ్బారెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచాలి

కడప సెవెన్‌రోడ్స్: బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై మంజూరు చేసే రుణాలకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించాలని బీసీ మహా సభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 8వ తేదీ నుంచి 16వతేదీ వరకు రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం గడువు విధించిందన్నారు. అయితే ఇంతవరకూ ఆన్‌లైన్ ఓపెన్ కాకపోగా, ఈ నెల 15వతేదీ వరకు ప్రభుత్వ సెలవు దినాలు ఉన్నందున కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందడం సాధ్యం కాదన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు గడువు పెంచాలని ఆయన కోరారు.

పండగ పూటా.. చెత్త తీయరంట



సంక్రాంతి పండగ నేపథ్యంలో వీధులు శుభ్రంగా ఉంచాల్సిన సిబ్బంది చెత్తను అలాగే వదిలేశారు. నగరం లోని 26వ డివిజన్ ఎస్‌ఎఫ్ స్ట్రీట్ నుంచి బీకేఎం స్ట్రీట్ వీధిలో చెత్త నిండి దుర్గంధం వెదజల్లుతోంది. నిత్యం వందలాది మంది ఈ మార్గాన తిరుగుతున్నా.. ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. – సాక్షి ఫొటోగ్రాఫర్